నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, మంగళవారం 8 ఏప్రిల్ 2025 | RANGAREDDY


మేడిపల్లిలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమావేశమైన రైతులు కోర్టు స్టే కాపీలను చూపుతూ..

# కోర్టు ఉత్తర్వులంటే లెక్కలేదా..?

## అధికారుల వైఖరిపై ఫార్మా వ్యతిరేక కమిటీ ఆగ్రహం

## స్టే ఉన్న భూముల్లో సర్వేపై కోర్టును ఆశ్రయించనున్నట్టు వెల్లడి

రంగారెడ్డి, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఫార్మాకోసం సేకరించిన భూములపై కోర్టు స్టే ఉన్నా.. దానిని ధిక్కరించి అధికారులు కంచె వేసే పనులను ముమ్మరం చేశారు. కోర్టు స్టే ఉన్న భూముల్లో సర్వే చేసి కంచెను ఏర్పాటు చేయొద్దని రైతులు, పలు పార్టీల నాయకులు అడ్డుకుంటే పోలీసులు వారిని ఠాణాలను తరలించి ఆ పనులను పోలీసు పహారా మధ్య చేపడుతున్నారు. ఇప్పటికే మేడిపల్లిలో నాలుగు బృందాలతో ఓ వైపు సర్వే, మరో వైపు కంచె పనులను చేపడుతుండగా.. నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోనూ కంచె వేసే పనులను చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో బాధిత గ్రామాల రైతులు సోమవారం మేడిపల్లిలో సమావేశమయ్యారు. ఇందులో అధికారులు కోర్టు స్టేనూ ధిక్కరించి ఫార్మా భూముల్లో కంచె వేయటాన్ని వెంటనే నిలిపేయాలని.. లేని పక్షంలో న్యాయ పోరాటం చేయాలని తీర్మానించారు. బాధిత రైతులకు ఇండ్ల స్థలాలు, పరిహారం, పునరావాసం, ఇంటికో ఉద్యోగం వంటివి ఇవ్వకుండానే పొలాల్లో కంచె వేస్తుండడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఒక్క తాటిపైకి బాధిత రైతులు..

ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బాధిత రైతులు ఒక్కతాటిపైకి వచ్చారు. అధికారులు తమ భూముల్లో చేపడుతున్న పనులను నిలిపేయకపోతే న్యాయపోరాటం చేయాలని యోచిస్తున్నారు. యా చారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 979 మంది రైతులు, కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట, బేగరికంచె, పంజాగూడ, అన్నోజిగూడ, ముచ్చర్ల, సార్లరావులపల్లి, సాయిరెడ్డిగూడ గ్రామాలకు చెందిన 868 మంది ఫార్మాలో భూములు కోల్పోయిన వారున్నారు. వీరందరికీ మీర్‌ఖాన్‌పేట సమీపంలో ప్రత్యేక వెంచర్ ఏర్పాటు చేసి అందులో ప్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చి గత ప్రభుత్వం సర్టిఫికెట్లు కూడా ఇచ్చింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం కొంగరకలాన్ నుంచి ఆకుతోటపల్లి వరకు ఏర్పాటు చేస్తున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కొంతభాగం ప్లాట్ల నుంచి వెళ్తుండడంతో రైతులకు ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ ఆగిపోయింది. గత సంక్రాంతి నాటికే రైతులకు ఇండ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసి ఇస్తామని కలెక్టర్ హామీ ఇవ్వగా ఫ్యూచర్‌సిటీ రోడ్డు నిర్మాణం పట్టాల పంపిణీకి అడ్డంకిగా మారింది.

### కంచె ఏర్పాటు చట్టవ్యతిరేకం.. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ

ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ఎలాంటి పనులు చేపట్టొద్దని ఇప్పటికే కోర్టు స్టే విధించినా.. ప్రభుత్వం మొండిగా ఆ భూముల్లో కంచెను ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ అభిప్రాయపడింది. ఈ మేరకు సోమవారం పలువురు ఫార్మా బాధిత గ్రామాల రైతులు మేడిపల్లిలో సమావేశమయ్యారు.

ఫార్మాసిటీ భూముల్లో కంచె ఏర్పాటు కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని.. ఇప్పటికే కలెక్టర్, మహేశ్వరం డీసీపీ, కందుకూరు, ఇబ్రహీంపట్నం ఆర్డీవోలు, ఇబ్రహీంపట్నం ఏసీపీ, ఫార్మా ఠాణా సీఐ, యాచారం తహసీల్దార్లకు కోర్టు స్టేలను జతచేసి ఇచ్చామని.. వాటికి స్పందించకపోతే న్యాయ పోరాటం ద్వారా అడ్డుకుంటామన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం అన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు.

రైతులకు న్యాయం జరిగే వరకు కంచె ఏర్పాటు పనులను నిలిపేసేందుకు కార్యాచరణను రూపొందిస్తున్నామని వారు పేర్కొన్నా రు. కార్యక్రమంలో ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకురాలు కావుల సరస్వతి, నారాయణ, రాజశేఖర్‌రెడ్డి, మహిపాల్, నిరంజన్, భగవంత్‌రెడ్డి, నాగరాజు, వినోద్‌రెడ్డి, శ్రీకాంత్, శంకర్, అచ్చిరెడ్డి, కొండల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న భూముల ఫెన్సింగ్ పనులు

యాచారం : మండలంలోని మేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన భూ ముల్లో ఫెన్సింగ్ పనులు సోమవారం సైతం పోలీసుల భారీ బందోబస్తుతో కొనసాగాయి. గ్రామంలో మూడోరోజు ఆర్ఐలు మురళీకృష్ణ, రామకృష్ణ, టీజీఐఐసీ అధికారులు తమ సిబ్బందితో కలిసి భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు హద్దులు గుర్తించి, వెంటనే ఐరన్ ఫిల్లర్లు నాటించారు. రైతులు ఆటంకం కలిగించకుండా ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజులు తమ సిబ్బందితో భారీ బందోబస్తు కల్పించారు. ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గతంలో పరిహారం తీసుకున్న రైతుల భూములకు ముమ్మరంగా ఫెన్సింగ్ వేసే ప్రక్రియ కొనసాగుతున్నది.


ఫార్మా భూముల్లో సర్వే చేస్తున్న సిబ్బంది



## మిషన్ భగీరథ రాకుంటే ట్యాంకర్‌తో నీటిని అందిస్తాం

దోమ, ఏప్రిల్ 7 : మండలంలోని ఊటుపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన ఊటుపల్లి తండావాసులు గుక్కెడు నీటి కోసం... అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం తండాకు వచ్చి తాగునీటి ఇబ్బందులను పరిశీలించారు. మిషన్ భగీరథ తాగునీరు రాని సమయంలో పంచాయతీ ట్యాం కర్ ద్వారా నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. అంతేకాకుండా స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కొత్తగా బోరుకోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో రాజేశ్, పంచా యతీ కార్యదర్శి విజయ్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.


నమస్తే ఎఫెక్ట్

## అందని జీతాలు.. అవస్థల్లో ధరణి ఆపరేటర్లు

### 12 నెలలుగా పెండింగ్‌లో సాలరీలు

### కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన

ఆమనగల్లు, ఏప్రిల్ 7 : తమది ప్రజా పాలన అంటూ గొప్పలు చెప్పుకొంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ కాలం వెళ్లదీస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో రంగారెడ్డి జిల్లాలోని ధరణి ఆపరేటర్ల దుస్థితి అగమ్యగోచరంగా మారింది. చాలీచాలని జీతంతో బతుకు బండిని లాగిస్తున్న వారికి.. గత 12 నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి అద్దె, పిల్లల చదువు, కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తున్నదని.. ఈ విషయంపై అధికారులు, ప్రజా ప్రతినిధులను కలి సి తమ గోడు విన్నవించుకున్నా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018 మే 23న మండలానికి ఒకరి చొప్పున ధరణి ఆపరేటర్‌ను.. జిల్లాకు ఒకరి చొప్పున జిల్లా కో-ఆర్డినేటర్‌ను గత ప్రభుత్వం నియమించింది. వీరికి గత పన్నెండు నెలలుగా జీతాలు అందడమే లేదు. పేరుకు మాత్రం రూ.24 వేల వేతనం వస్తుందని చెప్పినప్పటికీ అన్ని కటింగ్‌లు పోను చేతికి అందేది కేవలం రూ. 11,500 మాత్రమే. ఆ వేతనం కూడా సక్రమంగా అందక వారు అవస్థలు పడుతున్నారు. జీవో నం 63 ప్రకారం పరేటర్లకు రూ.31,040 వేతనం చెల్లించాలని కోరుతున్నారు.


కొడంగల్ : కుదురుమల్లలో వరి పంటను మేస్తున్న పశువులు

# కర్షకుల కన్నీటి వ్యథ

- రోజురోజుకూ అడుగంటుతున్న భూగర్భ జలాలు
- వట్టిపోయిన బోర్లు..ఎండుతున్న పంటలు
- పశువులకు మేతగా మారిన పొట్ట దశలో ఉన్న పంట
- కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాత

కొడంగల్, ఏప్రిల్ 7 : నీటి కరువుతో చేతికొచ్చిన పంట పశువులకు మేతగా మారుతున్నది. ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంట చేతికొచ్చే సమయంలో భూగర్భజలాలు పాతాళానికి చేరి.. బోర్లు వట్టిపోయి ఎండిపోతుండడంతో అన్నదాత కంట కన్నీరు వస్తున్నది. నియోజకవర్గంలో ప్రాజెక్టులు, కాల్వలు అందుబాటులో లేవు. వర్షంపైనే ఆధారపడి రైతన్న పంటలను సాగు చేస్తున్నాడు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో పుష్కలంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు నిండి భూగర్భజలాలు పెరిగాయి. అప్పుడు రెండు పంటలను పండించుకుని సంతోషంగా జీవించామని పలువురు అన్నదాతలు పేర్కొంటున్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సరిపడా వానలు కురియక.. భూగర్భజలాలు తగ్గి బోరు బావులు వట్టిపోయి పంటలు ఎండిపోతున్నాయని.. వాటిని పశువులకు మేతగా వేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఆలేడ్, హస్నాబాద్, అల్లిఖాన్ పల్లి, దుద్యాల, హకీంపేట, చెట్టుపల్లితండా, చిల్‌ముల్ మైల్వార్ తదితర గ్రామాల్లో నీరందక పంటలు ఎండిపోయాయి. అదేవిధంగా కుదురుమల్ల గ్రామానికి చెందిన నరేశ్ మూడు ఎకరాల్లో వరిని సాగు చేయగా.. ప్రస్తుతం నీళ్లు అందక రెండు ఎకరాల్లోని పంట ఎండిపోయింది. ఆలేడ్ గ్రామానికి చెందిన మోత్కూరు వెంకటయ్య, ఆంజనేయులు రెండు ఎకరాల్లో సాగు చేసిన వరి పంట, హస్నాబాద్ గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి రెండు ఎకరాల్లో వరిని నాటు వేయగా బోర్లు వట్టిపోయి పంట మొత్తం ఎండిపోయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు.


కొడంగల్ : మేత కోసం వరి పంటను కోస్తున్న రైతు



### రూ.50వేల లాగోడి.. భూమిపాలైంది..

బోరును నమ్ముకుని రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ఇందుకు రూ. 50,000 వరకు ఖర్చు అయింది. భూగర్భజలాలు తగ్గిపోవడంతో బోరు నుంచి నీళ్లు రాక.. సాగు చేసిన పంట మొత్తం ఎండిపోయింది. ఆ పంటను కోసి పశువులకు మేతగా వేస్తున్నా. తీసుకొచ్చిన అప్పును ఏలా తీర్చాలో అర్థం కావడంలేదు.

- పిల్లి వెంకటయ్య రైతు, కుదురుమల్ల, కొడంగల్

### మామిడి తోట, వరికి నీరందడం లేదు..



బోర్లు ఉన్నాయనే నమ్మకంతో ఐదు ఎకరాల్లో మామిడి తోట, మరో ఐదు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. ప్రస్తుతం మూడు బోర్ల నుంచి సరిపడా నీళ్లు రాకపోవడంతో తోట, వరి పంట ఎండిపోతున్నది. పంటను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లను తవ్విద్దామన్నా నీళ్లు పడతాయో లేదో అన్న భయం ఉన్నది. వరి పొట్ట దశకు రాగానే నీళ్లు అందడం లేదు. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి. -ముక్తార్, రైతు, ఆలేడు, కొడంగల్



### మూడు బోర్లు వేసినా ఫలితంలేదు

నేను రెండెకరాల్లో వరి పంట వేశా. గతంలో మూడు బోర్లు వేయగా నీళ్లు పుష్క లంగా ఉండేవి. కానీ, వేసవి కాలం రావడంతో భూగర్భజలాలు తగ్గి బోర్లు సరిపడా నీళ్లు పోయక పంట మొత్తం ఎండిపోతున్నది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

-రమేశ్, రైతు సాల్వీడ్, కులకచర్ల

### నాలుగు బోర్లు వేశా..



నేను రెండెకరాల్లో వరి పంటను సాగు చేశా. దానిని కాపాడుకునేందుకు నాలుగు బోర్లను తవ్వించా. అయినా, వాటిలో నీటి శాతం తగ్గిపోయింది. దీంతో వాటిని నమ్ముకుని సాగు చేసిన వరి పంట మొత్తం ఎండిపోతున్నది. ఇతరుల వద్ద అప్పులు తీసుకొచ్చి నాలుగు బోర్లను తవ్వించగా.. ఆ అప్పును ఎలా తీర్చాలో అర్థం కావడంలేదు. కుటుంబ పోషణ, పిల్లల చదువు కూడా భారంగా మారింది. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి.

-బస్వరాజ్, రైతు సాల్వీడ్, కులకచర్ల


కులకచర్ల మండలంలోని సాల్వీడ్‌లో బోర్లలో నీరు లేక ఎండిపోతున్న వరి పంట

### అప్పులు ఎలా తీర్చాలి.. దేవుడా..?

కులకచర్ల : అడుగంటుతున్న భూగర్భజలాలతో బోరుబావులు వట్టిపోయి పంటలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో ఉన్న వరి పంటకు సరిపడా నీరందక ఎండుతుండడంతో అన్నదాత తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. మండలంలో ఈ యాసంగిలో 5150 ఎకరాల్లో 4520 మంది రైతులు వరి పంటను సాగు చేయగా.. సాల్వీడ్ గ్రామంలో 210 ఎకరాల్లో 175 మంది రైతులు వరి పంటను సాగు చేశారు. బోరు బావులను నమ్ముకుని వరిని వేయగా.. నీరు పాతాళానికి చేరడంతో పంటలు ఎండిపోతున్నాయని.. తీసుకొచ్చిన అప్పులను ఎలా తీర్చాలి.. దేవుడా..? అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




భూమికి భూమి ఇవ్వాలని రాసి ఉన్న వినతిపత్రాన్ని అధికారికి అందిస్తున్న కొంగరకలాన్ రైతులు

# భూమికి భూమి ఇవ్వాల్సిందే..

- లేదంటే గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు భూములివ్వం..
- అధికారులకు తేల్చి చెప్పిన కొంగరకలాన్ రైతులు

ఆదిబట్ల, ఏప్రిల్ 7 : భూమికి భూమి ఇవ్వాలి.. లేదంటే ప్రభుత్వం నష్టపరిహారాన్ని పెంచి చెల్లించాలని కొంగరకలాన్ రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబర్ 13నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ వరకు 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం భూమిని సేకరిస్తున్నది. దీంతో కొంగరకలాన్ గ్రామంలో రోడ్డు వెడల్పులో భూములు కోల్పోతున్న 22 మందికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, భూసేకరణ అధికారులు గత నెల 25న నోటీసులు జారీ చేశారు. సోమవారం హెచ్‌ఎండీఏ ఏఈ రాజీవ్, రంగారెడ్డి జిల్లా భూసేకరణాధికారి రాజు, ఇబ్రహీంపట్నం రెవెన్యూ అధికారులు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో 300 ఫీట్ల వరకు భూములు కోల్పోతున్న రైతులతో కొంగరకలాన్‌లో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. భూమికి భూమి ఇవ్వాలి..లేదంటే ప్రభుత్వం నష్టపరిహారాన్ని పెంచి చెల్లించకుంటే తమ భూములను ఇచ్చే ప్రసక్తే లేదని రాతపూర్వకంగా రాసి ఇవ్వగా.. అధికారులు దానిని తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో గ్రామంలోని రోడ్డు ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.


తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ సోమవారం జేఎన్టీయూహెచ్ వర్సిటీ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఆందోళ న చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ, పాలిటెక్నిక్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసినట్లుగానే తమనూ క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

-కేపీహెచ్‌బీ కాలనీ